గృహప్రవేశానికి తాత్సారం

- ఐదు గ్రామాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- నిర్మించి ఏడాదైనా కేటాయించని వైనం
- ఇళ్ల కోసం ఎదురుచూపు



ఇల్లంతకుంటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

ఇల్లంతకుంట: ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వ హామీ మండలంలో ఇప్పటికీ నెరవేరలేదు. మండలంలోని పొత్తూరు, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, ఓబులాపూర్, కందికట్కూర్ గ్రామాల్లో 184 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. ఈ ఐదు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయితే దాదాపు రెండేళ్లు పూర్తికావస్తున్న ఇప్పటి వరకు లబ్ధిదారులకు మాత్రం ఇళ్లను కేటాయించడంలో తాత్సారం చేస్తున్నారు. అనంతారం గ్రామంలో 20 ఇళ్లను మంజూరు చేయగా లబ్ధిదారులు ఎవరి స్థలంలో వారే ఇప్పటి వరకు 15 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఐదు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయితే రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు ఎందుకు ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడం లేదని అంటున్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు స్పందించి లబ్ధిదారులకు ఇళ్లను అందజేయాలని కోరుతున్నారు.

ఎంపిక పూర్తయి ఏడాది

మండలంలోని పొత్తూరు, ఇల్లంతకుంట, కందికట్కూర్, ఓబులాపూర్, పెద్దలింగాపూర్ గ్రామాల్లో 184 ఇళ్లు నిర్మించి, ఇళ్లులేని లబ్ధిదారులను కూడా ఏడాది క్రితమే తహసీల్దార్ సమక్షంలో గ్రామసభలు పెట్టి ఎంపిక చేశారు. కాని ఇంకా ఇళ్లను కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు తమకు వస్తుందా అనే సందేహంలో లబ్ధిదారులు కొట్టుమిట్టాడుతున్నారు.

పెద్దలింగాపూర్‌లో సమస్య

మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ఇళ్ల నిర్మాణం పూర్తయినా, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, ఇళ్లలో చిన్న చిన్న పనులు ఇంకా మిగిలిఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ వచ్చి పనులు చేయకపోవడం, స్థానిక ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు పూర్తి చేసి త్వరగా ఇళ్లను ప్రారంభించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇళ్లు కేటాయించాలి



మండలంలోని ఐదు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు రెండేళ్ల క్రితమే పూర్తిచేశారు. కాని లబ్ధిదారులకు కేటాయించ లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించాలి.

– బత్తిని స్వామి, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్

మే రెండో వారంలో అందజేస్తాం



మండలంలోని ఐదు గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యింది. చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనులన్నీ పూర్తి చేసి మే రెండో వారంలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తాం.

– సిద్ధం వేణు, జెడ్పీ వైస్‌చైర్మన్

క్లుప్తంగా

అంబేడ్కర్ స్ఫూర్తిని ప్రపంచానికి చాటుదాం



అంబేడ్కర్ విగ్రహం ముందు విగ్రహ దాతలు

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ నందగిరి లింగం అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు నడిమెల ఎల్లయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళితరత్న అవార్డు గ్రహీత జేఎస్ పరంజ్యోతి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, స్వావలంబన కోసం తన జీవితాన్ని ధారపోసిన అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కంకణబద్ధులు కావాలన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య, ఎంపీపీ భూల సంతోష్, జెడ్పీటీసీ కళావతి, ఎంపీటీసీ రేణుక, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు, మోతీలాల్, విగ్రహదాత మాలోత్ మోహన్, మాలోత్ రాంచందర్, లాకవత్ శర్మన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేటలో చందుర్తి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, రుద్రంగి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ ఏనుగుల జమున, సింగిల్ విండో డైరెక్టర్ మొగిలి రవి, పాల్గొన్నారు.

బండపల్లిలో..

చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో సనుగుల సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కేడీసీసీ డైరెక్టర్, సనుగుల సింగిల్‌విండో చైర్మన్ జలగం కిషన్‌రావు, గ్రామ సర్పంచ్ న్యాత విజయజార్జ్, సింగిల్‌విండో డైరెక్టర్లు గడ్డం తిరుపతిరెడ్డి, పకిడే గోపాల్, రైతులు ఏనుగు లచ్చిరెడ్డి, గడ్డం జలపతిరెడ్డి, మారుపాక శంకర్, రేగుల రాములు, సనుగుల సీఈవో శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

ముగింపు సభకు తరలిన డీఎస్పీ నాయకులు



ముగింపు సభకు తరలివెళ్తున్న నాయకులు

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లి గ్రామం నుండి డీఎస్పీ నాయకులు స్వరాజ్య ముగింపు పాదయాత్రకు తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం సరూర్ నగర్‌లో జరిగే భారీ బహిరంగ సభకు తరలివెళ్తున్న తెలిపారు. ఈ సందర్భంగా బస్సుల్లో డీఎస్పీ కార్యాకర్తలు తరలివెళ్లారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్యం కోసం విశారదన్ మహారాజ్ పాదయాత్ర ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా సమాజంలో ఉన్నతంగా ఎదగాలని రాష్ట్రంలోని అన్ని జిల్లాలు తిరిగారన్నారు.

చిత్రకథ



ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

రుద్రంగి: మండల కేంద్రంలోని రైతుల పంట పొలాల వద్ద విద్యుత్ వైర్లు మనిషికి అందే అంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే స్పందించి విద్యుత్ వైర్ల ఎత్తు పెంచాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మండలంలోని నాగారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు కల్యాణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామంలో స్వామి వారి విగ్రహాలతో శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రతిమ ఆస్పత్రి బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు, మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, సర్పంచ్ బాస లావణ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, ఎంపీటీసీ మల్లేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పెద్ద పట్నం వేస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో మహంకాళి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద పట్నంతో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి, రెడ్డి సంఘం బాధ్యులు చల్లాదేవిరెడ్డి, కస్తూరి శ్రీనివాస్‌రెడ్డి, మారెడ్డి వెంకట్‌రెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జిల్ల వెంకటస్వామి, సర్పంచ్ వెంకటేశ్వరి, ఉపసర్పంచ్ కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనమో పోచమ్మ



కోనరావుపేటలో బోనాలతో మహిళలు



శాభాష్‌పల్లిలో..

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/వేములవాడఅర్బన్: ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌లో రెడ్డి సంఘం, కోనరావుపేట మండలం కనగర్తిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో, వేములవాడ మండలం శాభాష్‌పల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించగా, బైండ్లవాళ్ల గాండ్రింపులు, శివసత్తుల పూనకాలతో దారిపొడవున నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారికి బోనం సమర్పించి ఒడి బియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లజెల్లా, పాడి, పశుసంపద చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. మేకపిల్లను గావుపట్టి పోచమ్మను దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమాల్లో శాలివాహన సంఘం నాయకులు వంగపెల్లి పర్శరాములు, దేవరాజు, రామచంద్రం, శేఖర్ సర్పంచ్ నిమ్మ లక్ష్మి, రెడ్డి సంఘం అధ్యక్షుడు నిమ్మ మల్లారెడ్డి, సభ్యులు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, నారాయణరెడ్డి, దేవిరెడ్డి, శాభాష్‌పల్లి సర్పంచ్ పండుగ ప్రదీప్‌మహిళలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



మర్తనపేటలో కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కోనరావుపేట: మండలం మర్తనపేటలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రతిమ ఫౌండేషన్ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు హాజరయ్యారు. ఆలయాభివృద్ధికి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు చెన్నమనేని వంశీకృష్ణరావు, బొజ్జం వసంత, ఆలయ కమిటీ బాధ్యులు గుర్రం చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, బీజేవైఎం అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'కు విశేష స్పందన



బోయినపల్లి: తడగొండలో మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న ప్రజలు

కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి: ప్రధాని మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను టీవీ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆసక్తి తిలకించారు. ప్రధాని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. ముఖ్యంగా యువత, వృద్ధులు ఈ కార్యక్రమాన్ని చూసేందుకు ఆసక్తి చూపారు. పార్టీ నాయకులు ప్రత్యేకంగా పార్టీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా టీవీలు ఏర్పాటు చేసి ప్రజలు చూసేందుకు వీలు కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం



రుద్రంగి: స్థానిక వేంకటేశ్వర ఆలయం సమీప అడవుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరికివేశారు. అడవుల ధ్వంసానికి పాల్పడుతూ, చెట్లను నరుకుతూ అక్రమ కలప స్మగ్లింగ్ చేస్తున్న వారికి అటవీ శాఖ అధికారుల అండదండలు ఉండడంతోనే యథేచ్ఛగా చెట్లను నరుకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే చెట్ల నరికివేతను అరికట్టవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి



ముస్తాబాద్‌లో కలశాలతో మహిళల ఊరేగింపు

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేటలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముస్తాబాద్‌లో శ్రీశివకేశవ ఆలయం నుంచి 108 కలశాలతో మహిళలు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం వాటితో అమ్మవారి ఉత్సవ విగ్రహనికి అభిషేకాలు చేశారు. మార్కెట్‌లోని పురాతన శివాలయంలో పూజలు, అభిషేకాలు చేశారు. ఎల్లారెడ్డిపేటలో ఆలయంలో ఉదయం పుణ్యహవచనం, ప్రధాన కలశ స్థాపన, శ్రీసూక్త హవనం, పూర్ణాహుతి, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షులు కూర బిక్షపతి, గుండా చిన్న మల్లేశం, ప్రతినిధులు చందా విజయ్‌కుమార్, గందె రమేశ్, అర్వపల్లి సుదర్శన్, కూర నగేశ్, బండారి సత్తయ్య, పప్పుల శ్రీధర్, శ్రీకాంత్, ఉప్పల చంద్రం, కృష్ణమూర్తి, సంతోష్, శ్రీనివాస్, రమేశ్, భూమేశ్,భాస్కర్, ప్రసాద్, బాలరాజు, నారాయణ, అమర్, అంజనేయులు, లక్ష్మీనారాయణ, రాజయ్య, నాగేంద్రం, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

మూడో రోజుకు పంచాయతీ కార్యదర్శుల సమ్మె



వేములవాడ: నిరవధిక సమ్మెలో కార్యదర్శులు



కోనరావుపేటలో..

వేములవాడ: సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులు చేస్తున్న మూడో రోజుకు చేరుకుంది. వేములవాడ ప్రాంతంలోని 28 గ్రామాలకు చెందిన కార్యదర్శులు ఆదివారం స్థానిక తెలంగాణ చౌక్‌లోని ఉద్యమాల గద్దెపై నిరవదిక సమ్మె చేపట్టారు. 2019, ఏప్రిల్ 11న విధుల్లో చేరిన తమకు నేటికీ పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రొబేషనరీ పీరియడ్ పూర్తయినా ఇంకా రెగ్యులరైజ్ చేయడం లేదనీ, తమను రెగ్యులరైజ్ చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. సమ్మెకు ప్రతిపక్షాలు మద్దతు తెలిపాయి.

సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: ప్రొబేషనరీ పీరియడ్ ముగిసిన కార్యదర్శులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమ్మెకు సామాజిక కార్యకర్త గున్నాల లక్ష్మణ్ మద్దతు ప్రకటించారు. ఈ సమ్మెలో కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు అనిల్, శ్రీకాంత్, సాయి, కవితారెడ్డి, మమత, జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ సంఘీభావం

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పక్షాన జూనియర్ కార్యదర్శులకు అండదండగా ఉంటామన్నారు. పంచాయతీ రాజ్ సెల్ జిల్లా కన్వీనర్ చిట్నేని శ్రీనివాస్‌రావు, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు యెల్ల గిరి, మిడిదొడ్డి దేవేందర్, బాద నరేశ్, హరీశ్, భాను, సత్యం పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ ఈ–పంచాయతీ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శేషాద్రి మద్దతు ప్రకటించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌ల శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీబావం ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకం సంతోష్, సుమన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



వెంకట్రావుపేటలో భూమిపూజ చేస్తున్న సర్పంచ్

కోనరావుపేట: మండలం వెంకట్రావుపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సర్పంచ్ మంతెన సంతోష్ ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామంలోని ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. అర్చకులు తిరునహరి కృష్ణస్వామి–శ్రీదేవి దంపతులు రూ.లక్ష, మంతెన మల్లేశం బ్రదర్స్ రూ.లక్ష, బత్తుల ఆనందర్(మేస్త్రీ) రూ.2 లక్షల విలువైన పనులు, పల్లం భూమయ్య రూ.60 వేలు, గుజ్జె మల్లేశం రూ.60 వేలు, చెరుకుపెల్లి భీంరెడ్డి–సుజాత దంపతులు రూ.11,116 విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లె మంజుల, ఆలయ చైర్మన్ వడ్నాల రవీందర్, కదిరె మల్లేశం, మంతెన దేవయ్య, జొర్రిగ మల్లేశం, రాగెళ్ల పెద్దవెంకటి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రావు

ముస్తాబాద్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయడం అభినందనీయమని టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు అన్నారు. మండలం తెర్లుమద్దిలో తిరుమల నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు. ప్రభుత్వం వైద్యారోగ్యాశాఖను బలోపేతం చేసిందన్నారు. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య సాయం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు రాజేశ్, సర్పంచ్ కిషన్‌రావు పాల్గొన్నారు.